ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీభారతీదేవ్యైనమః

# ఉమాసహస్రము

## (పదియవ శతకమున – తృతీయ స్తబకము)
## ఏకోనచత్వారింశ స్తబకము

**అవ:-** ముప్పది తొమ్మిదవదియగు నీ స్తబకమున దేవీమహా భాగ్యమును ప్రస్తుతించి, మంత్ర – జప – ధ్యానములచేఁ గలుగు యోగసిద్ధులను ప్రతిపాదించు చున్నాఁడు. మఱియు, శ్రీ విద్యోద్ధారము గూడ నిందుగ్రహింపఁదగినదగుచున్నది.

మూ॥ వ్యాప్యేదమిన్ద్రోర్భువనం య ఏవ
ప్రాయేణ తస్యామలచన్ద్రి కాఽభూత్
మన్దస్తవార్తిం సధునోతుహాసో
నిశ్శేషలోకేశ్వర వల్లభాయాః॥ 1

సమస్తలోకేశ్వరుని ప్రేయసియగు పార్వతీదేవి యొక్క మందహాసమే – ఎదుటఁ గాన్పించుచున్న యీ చంద్రలోకమున వ్యాపించి ఆ చంద్రునియొక్క ప్రసన్న జ్యోత్స్నయైయున్నది. అది నీయార్తిని దొలఁగించుగాత!

**ప్రభ:-** ఆర్తియనఁగా వ్యథ. ఆవ్యధకు – భేషజమమృతమైయున్నది (ఆర్తికి మందు – అమృతము). వెన్నెల అమృతమయమగుట వలనను, దేవీమందహాసమే- ఆ వెన్నెలయై యుండుట వలనను, ఆ మందహాసము – ఆర్తిహరమగుట సంగతమేయగును. ''దేవీ మందహాసమే – అమృతమయమగు జ్యోత్స్నయగుట వలన. అది యీ వ్యధా నివృత్తి కౌషధమగును'' అని భావము.



**విశే:-** ఇచట – దేవీ మందస్మితము – చంద్రికగా సంభావింపఁబడినదని, గమ్యోత్ప్రేక్షనాశంకింపఁదగదు. మందహాసమే – జ్యోత్స్నయై యున్నదని, చంద్రికానిషేధమాక్షేపింపఁబడుట వలన '' ఇది – చంద్రిక కాదు, దేవీమంద హాసమే'' అనునర్థము గమ్యమగుచున్నది. ''ప్రకృతం ప్రతిషిధ్యాన్యస్థాపనం స్యాదపహ్నుతిః'' ''ప్రస్తుతమును నిషేధించి, తదితరమును స్థాపించుట అపహ్నవమగును'' అను సాహిత్యదర్పణోక్తలక్షణము వలన, ఇది – అపహ్నవాలంకారమగుచున్నది.

మూ॥ పూర్ణే వియ త్యేకతటిజ్జ్వలన్తీ
లోకాన శేషాన నిశంపచన్తీ।
మేఘేక దాచిన్మహసాస్ఫురన్తీ
చణ్డీప్రచణ్డా హరతాదఘంనః॥ 2

అఖండమగు నాకాశమునందు – అద్వితీయ సూక్ష్మతటిత్తై విరాజిల్లు నదియు, లోకముల నన్నింటిని గూడ – ఎల్లప్పుడును పరిణమింపఁజేయునదియు, ఒకానొకప్పుడు, మేఘమునందు మెఱుపై, స్ఫురించునదియు, నగు ప్రచండచండీ దేవి – మాదురితముల నపహరించుఁగాత!

**ప్రభ:-** ఐంద్రి యను పేరుగల ప్రచండ చండీశక్తి – భూమాకాశమున – మిక్కిలి సూక్ష్మ రూపమున వ్యాపించి, అంతర్దృష్టి గమ్యమగు విద్యుద్రూపమున వెలయుచున్నది. ఆమెయే, ప్రపంచమును పరిపక్వమొనర్చుచున్నది. ఆమెయే – తన యునికి, నొకయంశము వలనఁ బ్రకటించుచు, స్థూలదృగ్గోచరమగు విద్యుద్రూపమున నప్పుడప్పుడు, మేఘములయందు మెరయుచున్నది.

**అవ:-** ఓజో ధర్మసామ్యము వలన – ప్రచండచండీ – కాళీ – స్వరూప మొక్కటియేయయినను, కర్మ భేదము వలన – నామభేదము నెఱుఁగునది. ఇప్పుడు పాచకశక్తియగు కాళిని – సంబోధించుచున్నాఁడు.

మూ॥ గోలాని కాన్యపృథునోద్భవన్తి
జీర్యన్తికాన్యప్యఖిలేశ కాన్తే!
యాన్త్యమ్బికే కాన్యపి వృద్ధిమత్ర
పాకేభవత్యాః పరితః ప్రవృత్తే॥ 3

సర్వేశ్వర సుందరివగు జననీ! నీ పాకము (పరిణామ విధానము) సర్వతః ప్రచలితమగునపుడు, గోళములు – కొన్ని (గోళాకారములగు భువనములు – లేక, బ్రహ్మాండములు కొన్ని) వెంటనే యుద్భవించుచుండును. కొన్ని గోళములు– క్షయించుచుండును. మఱికొన్ని గోళములు వృద్ధినొందుచుండును.

ప్రభ:- 'నీ పాకము – సకలభువనజన్మ – వృద్ధిక్షయ కారి' అని భావము ''కొన్ని లోకములుదయించుచుండ, నింక కొన్ని లోకములు క్షీణించుచుండ మఱికొన్ని లోకములు వృద్ధినొందుచుండుటకు నీపాక మహిమయే – కారణము. ఒకే కాలమున, భిన్న భిన్న దేశములయందు నీ పాకమహిమ చేతనే – ఉత్పత్తి, వృద్ధి, క్షయములను కర్మలు మూడును కలుగుచున్నవి'' అని భావము.

మూ॥ భాసాంవినేత్రా మహతా గ్రహైశ్చ
భూరి ప్రమాణైర్యుత మీశకాన్తే!
ఏకైక మణ్డం తవ లోమవచ్చేత్
కస్తే మహద్ భాగ్యమిహ బ్రవీతు॥ 4

ఈశ్వర ప్రియవగు మాతా! బృహద్రూపుఁడును, కాంతిసంధాతయు, నగు సూర్యునితోడను – అధిక ప్రమాణములు గల కుజాది గ్రహములతోడను – గూడిన ఒక్కొక బ్రహ్మాండము – నీకు – ఒక్కొక్క తనూరుహమువంటి దగుచున్నది. ఇట్లుండ – అపారమగు. నీ మహాభాగ్యము నీలోకమున మాలో నెవ్వడు వచించును?



ప్రభ:- వనస్పతులు (వృక్షములు) పృథివికిరోమములవలె జనించుచున్నవి. ప్రాణుల శరీరములనుండి తనూరుహములు పుట్టుచున్నవి. ఇట్లే, దేవీ శరీరమగు పరమాకాశమునుండి – అక్కడక్కడ, అసంఖ్యేయములగు బ్రహ్మాండములు – మొలుచుచుండును. '' ఏతావానస్యమహిమా'' ''ప్రజ్ఞాయుక్తుఁడగు బ్రహ్మము యొక్క మహిమ యింతటిది'' అని, వినఁబడుచున్నది గదా!

మూ॥ నాథస్య తేరూపమణోరణీయో
మాత స్త్వదీయం మహతో మహీయః।
జానాతియో దేవిరహస్యమేతద్
వ్యాఖ్యాతుమేష ప్రభవత్య శేషమ్॥ 5

మాతా! నీకు నాథుఁడగు నీశ్వరుని రూపము – అణువుకంటెను, కూడ– సూక్ష్మతరమైయున్నది. నీ రూపము – మహత్తుకంటెను గూడ – (పెద్దదగు రూపము కంటెను గూడ) మహత్తరమై, (మిక్కిలి పెద్దదై) యున్నది. దేవీ! ఈ రహస్యము నెఱిఁగిన బుద్ధిమంతుఁడు – సమస్తమును గూడ విశేషించి తెలుపుటకు శక్తుఁడగును.

ప్రభ:- '' అణోరణీయా మహతో మహీయా నాత్మాస్యజన్తోర్నిహితం గుహాయామ్'' '' ఈ ప్రాణుల బుద్ధిగుహయందున్న ఆత్మ – అణోరణీయుఁడు (సూక్ష్మమగు నణువుకంటెను గూడ సూక్ష్మతరమగు రూపముగలవాడు) అతఁడే– మహతో మహీయుఁడు, (స్థూలవస్తువుకంటెను గూడ స్థూలమైన వాఁడు) అని శ్రుతియందు వినఁబడుచున్నది గదా! మిక్కిలి సూక్ష్మమును, అంతర్నిహితమును, అగుట వలన, ఆత్మ – అణోరణీయువగుచున్నది. వికసించునదియు, బృహద్రూపము గలదియు, సర్వాత్మకమును, అగుట వలన నదియే మహతో మహీయమగుచున్నది. ద్రష్టయు, (దేహేంద్రియప్రాణమనో బుద్ధులకు సాక్షియు) పురుషుఁడును, (పురమగు శరీరమున శయనించువాఁడును) అగు ఆత్మ అణోరణీయమును, తద్ వైభవము నావిష్కరించుట వలన ఆత్మశక్తి – మహతో మహీయమును, అగుచున్నదని గ్రహించునది.

మూ॥ యద్ గర్జితం వారిదఘర్షణేషు
శబ్దస్తవాయం సుగభీరఘోషః॥
యల్లోకరాజ్ఞి! స్ఫురితం తదేత
దుజ్జృమ్భితం కిఞ్చన కాన్తి వీచేః॥ 6

అమ్మా! జలము లొకదానితో నింకొకటి సంఘర్షము నొందు నపుడుద్భవించుచున్న గర్జితము – గంభీర నిర్ఘోషమగు నీ శబ్దమైయున్నది. జగదీశ్వరీ! ఆ మేఘములయందుదయించుచున్న మెరుపు – నీకాంతి తరంగము యొక్క ఉజ్జృంభితమై (ఉల్లసితమై) యున్నది.

ప్రభ:- **ఉరుము** – నీ శబ్దము, **మెఱుపు** – నీ కాంతి విశేషము

మూ॥ ఇన్ద్రస్య వజ్రం జ్వలితం కృశానో
ర్జ్యోతిస్సహస్రచ్ఛదబాన్ధవస్య
పీయూషభానోర్హసితం విసారి
జీవస్య చక్షుర్మమతాత! దైవమ్॥ 7

తాతా! ఇంద్రునకు వజ్రమును, (విద్యుద్ రూపమగు తేజమును) అగ్నికి–జ్వలనమును, (జ్వాలయు) కమలబంధుఁడగు సూర్యునికి – జ్యోతిస్సును, అమృతకిరణుఁడగు చంద్రునికి – ప్రసరించు వెన్నెలయు, జీవునకు – కన్నును, (ద్రష్టయగు చైతన్యమున) అగుచున్న వస్తువు – జ్యోతిర్మయమగు నా దైవ స్వరూపమై యున్నది.

ప్రభ:- '' ఒక్కటియే యగు జ్యోతిస్సు – ఇంద్రునకు – వజ్రమై, అగ్నికి-జ్వాలయై, సూర్యునికి – తేజమై, చంద్రునికి మహస్సై, కంటికి తేజమై, యున్నది. కావున ఉపాధి భేదము వలననే. నామ భేదమును, వ్యాపార భేదమును, కలుగుచుండును. కావున శ్రేష్ఠమగు పరమజ్యోతి యొక్కటియే – నేనుపాసింపఁదగిన దైవమగుచున్నది'' అని భావము.



మూ॥ యస్యైవతేజః ప్రవిభక్తమర్క-
విద్యుచ్ఛశాఙ్కానల లోచనేషు
గూఢం తదాకాశగృహే సమన్తా
దన్తానభిజ్ఞం ప్రణమామి దైవమ్॥ 8

దైవమునకు సంబంధించి నదియేయగు నేతేజస్సు – సూర్యునియందును, విద్యుత్తునందును, చంద్రునియందును, అగ్నియందును, నేత్రమునందును, వేరువేరుగా నున్నట్లు భిన్నమైయున్నదో, ఆకాశ రూపమగు గృహమునందంతటను గూఢమై, అంతము తెలియని (అనవధికమగు) ఆ దైవమునకు ప్రణమిల్లుచున్నాను.

మూ॥ జాగ్రత్సుబుద్ధి ర్నిమిషత్సు నిద్రా
శుష్కేషు పక్తిస్తరుణేషు వృద్ధిః
ధీరేషునిష్ఠా చపలేషు చేష్టా
దేవీమమాపత్తి మపాకరోతు॥ 9

జాగ్రదవస్థగల వారియందు – బుద్ధియు, నిమీలిత నయనుల యందు – నిద్రయు, శుష్కములగు (రసవిహీనులగు) వస్తువులయందు పాకరూపిణియు, యౌవనసంపన్నులయందు – వృద్ధియు, (పుష్టియు) ధీరులయందు – (ఇంద్రియనిగ్రహము గలవారియందు) నిష్ఠయు, (దృఢస్థితియు) చపలులయందు – చేష్టయు, అగుచున్న దేవి – నాయాపదను తొలఁగించుఁగాత!

ప్రభ:- ఒక్కతెయేయగు దేవిని – బుద్ధి నిద్రాది రూపములగు బహువిధములచే నుల్లేఖించుట వలన నిది – ఉల్లేఖాలంకారమగుచున్నది.

మూ॥ విద్యావతో వాద విధానశక్తి
ర్వీరస్య సఙ్గ్రామవిధానశక్తిః
నారీమణే ర్మోహవిధాన శక్తి
ర్లేశత్రయం కిఞ్చిదపారశక్తేః॥ 10

విద్వాంసునకుఁగల వాద విధాన శక్తియు, (వాద నిర్వాహసమర్థతయు) విక్రమ వంతునకుఁగల సంగ్రామ కరణ శక్తియు; స్త్రీ రత్నమునకుఁ గల సమ్మోహన విలాస శక్తియు; అను శక్తిత్రయము - అపార శక్తియగు మహాశక్తి యొక్క అత్యల్పమగు శక్తి లేశత్రయమైయున్నది.

మూ॥ ఉత్సాహయన్తీ తపతాం మనాంసి
సఙ్క్షోదయన్తీచ మహాక్రియాసు।
సఙ్క్షోభయన్తీ హృదయంఖలానాం
సమ్మోహయన్తీచ పరావాతాన్నః॥ 11

తపోనిష్ఠులగు వారి మనస్సుల నుత్సాహము నొందఁజేయునదియు, వారి మనస్సులను మహా క్రియలయందు ప్రేరణమొనర్చునదియు, ఖలులహృదయమును సంక్షోభింపఁజేయునదియు, నగు పరాంబిక - మమ్ము రక్షింపుఁగాత!

ప్రభ:- ''తపోనిష్ఠుల యందనుగ్రహమును, దుష్టులయందు నిగ్రహమును, ప్రదర్శించునదియగు పరాశక్తి - మాకు రక్షయగుఁగాత'' అని భావము.

మూ॥ సఞ్చాలయన్తీ సకలస్య దేహం
వ్యానస్యశక్త్యా పరితోలసన్త్యా।
జేతుః ప్రతాపేఽస్తి పలాయనేఽస్తి
భీతస్య చేయం నిఖిలేశశక్తిః॥ 12

శరీరమునందంతటను విలసిల్లుచు, వ్యాపనశీలమగు వ్యానమను ప్రాణవాయువు యొక్క శక్తి చేత సకలజనుల యొక్కయు దేహములను చలింపఁజేయునది యగు నీసర్వేశ్వర శక్తి - యుద్ధ విజయియగు వీరుని ప్రతాపమునందున్నది. యుద్ధపరాజితుఁడగు భీతుని పలాయనమునందున్నది.



ప్రభ:- చాలకశక్తియగు నీ పరమేశ్వరియే - జయశాలి యొక్క ప్రతాపమునందును, పరాజితుని పలాయనమునందును గూడ - వర్తించుచుండునని భావము.

మూ॥ ఏకం స్వరూపం బహు చిత్రయోగాత్
సన్దర్శయన్తీ వివిధం జనేభ్యః।
సమ్యగ్దృశేస్వం విభు మర్పయన్తీ
సర్వాదిమాయైవ మహేశజాయా॥ 13

'' ఏకమగు నిజరూపమును - అనేకమును, అద్భుతమును, అగు కల్పనము చేత - మూలస్వరూపము నెఱుఁగని జనుల కొఱకు - నానా రూపముగాఁ బ్రదర్శించునదియు, సమ్యగ్ జ్ఞానము గల (యథార్థ దర్శనము గల) జ్ఞానికి - తన ప్రభువగు నీశ్వరుని సమర్పించునదియు, అగు విశ్వమూలమాయయే - మహేశ జాయయగుచున్నది.''

ప్రభ:- ''మాయాశక్తి - అద్భుతములగు శక్తుల చేత నొక్కటియే యగు స్వరూపమును - బహురూపములుగా నొనరించి, ప్రదర్శించుచున్నది. లేక, చిత్రకలా విశేషముల చేత - ఒకే వస్తువు - బహు విధములుగాఁ బ్రదర్శింపఁబడునట్లు పరాశక్తి ఒకే స్వరూపమును - బహు రూపములుగాఁ జూపుచుండును. ఆమూల మాయాశక్తియే పరమేశ్వర ప్రేయసి'' అని భావము.

మూ॥ యస్త్వం శ్రయేతాఖిలసఙ్గతిస్త్వాం
ధ్యానేన మన్త్రేణ గుణ స్తవైర్వా
త్రైలోక్యసామ్రాజ్యధురన్ధరస్య
శుద్ధాన్తకాన్తే! స కృతీమనుష్యః॥ 14

త్రైలోక్యసామ్రాజ్యధురంధరుఁడగు సర్వేశ్వరుని సుందరివగు జననీ! సకల విశ్వసంగతి (హృదయంగమత) గలవాఁడై, మంత్రము చేతగాని, జపము చేతగాని, గుణ సంకీర్తనముల చేతగాని నిన్ను సేవించుచున్న మనుష్యుఁడే - ధన్యుడు.

మూ॥ మూలాగ్ని ముద్దీప్యశిరశ్శశాఙ్కం
సన్ద్రావ్య యస్తర్పయతే కృతీత్వామ్।
తస్మిన్ నగాధీశ్వరకన్య కే! త్వం
ప్రాదుర్భవన్తీన కి మాదధాసి॥ 15

నగరాజకుమారీ! మూలాధారమునందలి కులకుండాగ్ని నుద్దీపింపఁజేసి, సహస్రారమునందలి సోముని స్రవింపజేసి, నిన్ను తృప్తి నొందించు ధన్యుని యందు నీవు ప్రాదుర్భవించి, యుత్పాదింపనిదేమున్నది?

ప్రభ:- సర్వమును గూడ వానియందు పుట్టింతువని భావము.

మూ॥ యస్త్వాం సహస్రార సరోజమధ్యే
సోమస్య రూపాం భజతేఽమ్బ! యోగీ
తస్యాన్తరః శాన్తిముపైతితాపో
బాహ్యస్య కానామకథాల్పకస్య॥ 16

అమ్మా! ఏ యోగి – సహస్రార కమలమధ్యమున సోమస్వరూపిణివగు నిన్ను సేవించుచుండునో, ఆ యోగికి – అంతరమగు ( ఆధ్యాత్మికమగు) తాపము- శాంతించుచుండును. అత్యల్పమగు బాహ్య తాపము – (వేడి) శాంతించునని వేరుగా చెప్పవలయునా?

వివృతి – ''రోగముల వలనఁ గలుగునదియు, మానసిక వ్యథల వలన గలుగునదియు నగుతాపము – సహస్రారము నందు చంద్రకళాస్వరూపిణి యగు జగన్మాతను సేవించు ( ధ్యానించు) వారికి, తొలఁగును.

అవ:- దీనికి తరువాతిది యగు ప్రయోజనమును దెలుపుచున్నాఁడు.



మూ॥ దణ్డేనయోఽన్త ర్దహరేఽవతీర్ణః
ప్రాణేనవాచా మహసాధియావా
ప్రాప్నోతిసోఽయం పురమద్వితీయం
యత్రత్వమీశా సహచిత్రలీలా॥ 17

**వీణారూపమగు అస్థిదండమున, పశ్చాన్మార్గ ద్వారమున, ప్రాణవాయువు చేతఁగాని, వాగ్రూపమగు మంత్రము చేతఁగాని, తేజస్సు చేతఁగాని, బుద్ధిచేతగాని, హృదయాకాశమునకు అవతరించు (దిగు) చుండు యోగి - అద్వితీయమును, ఏకమును, అగు బ్రహ్మపురమను గమ్యస్థానమును బొందును. అచ్చట నీవీశ్వరునితోఁగూడ చిత్రలీలవై యుందువు.**

మూ॥ తన్త్రోదితం విశ్వ వినేత్రిమన్త్రం
యస్తేనరః సంయమవానుపాస్తే।
రుద్రాణి సాన్ద్రామ్బుదకేశపాశే
పాశైర్విముక్తః సజయత్య శేషమ్॥ 18

నీలమేఘము వలె దట్టమగు కేశపాశము గలదానవును, రుద్రాంగనవును, జగన్నాయికవును, అగుజననీ! తంత్రశాస్త్ర ప్రతిపాదితమును, అక్షరాత్మకమును, వీర్యవంతమును, అగు నీమంత్రమును – ధారణాధ్యాన సమాధి రూపమగు సంయమము గలిగి యుపాసించు మనుష్యుడు – అవిద్యా – వాసనా – ప్రేరిత పుత్రదారాది సంబంధము వలన పుట్టిన పాశముల ( బంధముల) చేత – విముక్తుఁడై (విడుదలనొంది) సమస్తమును జయించును.

అవ:- తంత్ర శాస్త్రములయందుఁ దెలుపఁబడిన 'శ్రీవిద్య( అను పేరు గల మంత్రరాజమును రెండు శ్లోకముల చేత నుద్ధరించుచున్నాఁడు. శ్రీ విద్యయందు ఖండత్రయాత్మకమై పంచదశాక్షరమై యుండుట వలన ఆ మంత్రము 'పంచదశి' అని చెప్పఁబడుచున్నది.

మూ॥ పద్మాసనో ద్వాదశవర్ణశాన్తీ
దమ్భోలిపాణి ర్భువనాధినాథా।
గీర్వాణమార్గో భృగురబ్జయోని
రస్తే తథాఽగ్రే చహలాం విరాజీ॥ 19

జమ్భస్యహన్తాఽనలశాన్తిచన్ద్రైః
సంయుక్త ఊష్మాగల దేశజన్మా।
దన్తస్థలీ సమ్భవ ఊష్మవర్ణో
వాణీపతిర్వ్రజధరశ్చ లజ్జా॥ 20

పద్మాసనుఁడని (బ్రహ్మయని) చెప్పబడిన 'కకారము' ద్వాదశవర్ణమని చెప్పఁబడిన, ' ఏకారము' శాంతియని చెప్పఁబడిన, 'ఈకారము' వజ్రహస్తుఁడని (ఇంద్రుఁడని) చెప్పఁబడిన 'లకారము' 'భువనేశ్వరియని చెప్పఁబడిన, హ్రీంకారము' అను వర్ణపంచకమగు క, ఏ, ఈ, ల హ్రీం, అను ప్రథమ ఖండమును, గీర్వాణ మార్గమని ( ఆకాశమని) చెప్పఁబడిన, 'హకారము', భృగువని చెప్పబడిన, 'సకారము', అబ్జయోనియని (బ్రహ్మయని) చెప్పఁబడిన, 'కకారము', క కారముమీఁదనున్న హల్లుల చివరనున్న, యక్షరమగు 'హకారము' జంభహన్తయని ( ఇంద్రుఁడని) చెప్పబడిన, 'లకారము' తదుపరి – అనలమని (అగ్నియని) చెప్పఁబడిన, రేఫముతోడను, శాంతియని చెప్పబడిన ఈకారముతోడను, చంద్రుఁడని చెప్పబడిన, 'అనుస్వారముతోడను, గూడినదై కంఠస్థానము నందుదయించిన యూష్మవర్ణమగు 'హకారమును' (హ్రీంఅనునదియు) అను వర్ణషట్కము గల హ, స, క, హల, హ్రీం' అను ద్వితీయఖండమును, దంతస్థలియందుదయించిన (దంత్యమగు ఊష్మవర్ణమగు 'సకారము', వాణీపతియగు (బ్రహ్మయగు) 'కకారము', వజ్రధరుఁడగు ( ఇంద్రుఁడగు) 'లకారము' లజ్జయగు 'హ్రీంకారము' అనువర్ణచతుష్కము గల 'స, క, ల, హ్రీం,' అను తృతీయ ఖండమును, గలిగి ''పంచదశాక్షరమగు నీ మంత్రము – పంచదశి' అని చెప్పఁబడును.



(''పంచదశీ మంత్రోపాసకులు'' అని లోక ప్రసిద్ధులగు నుపాసకులు దీనినే సేవింతురు.)

మూ॥ విద్యాత్వియం పఞ్చదశాక్షరాఢ్యా
సాక్షాన్మహామౌన గురూపదిష్టా
గోప్యాసుగోప్యా సుకృతైరవాప్యా
శ్రేష్ఠా వినుత్యా పరమేష్ఠినాఽపి 21

ఇట్లు 'క; ఏ; ఈ; ల; హ్రీం' – 'హ; స; క; హ, ల; హ్రీం' 'స; క; ల; హ్రీం' అను ఖండత్రయ రూపము గలదియు, పంచదశాక్షరయుక్తయు, అగు శ్రీవిద్య – సాక్షాత్తుగా మహామౌనగురువగు దక్షిణామూర్తిచేత (మహాదేవుని చేత) ఉపదేశింపఁబడినది.

ఈ విద్య – గోప్యములగు రహస్య విద్యలయందు మిక్కిలి గోప్యయై (రహస్యతమయై) యున్నది. మఱియు, నిది సుకృతములచే లభింపఁదగినదియు, బ్రహ్మదేవునిచేఁ గూడ స్తుతింపఁదగినదియు, సర్వ విద్యలలోపలను; శ్రేష్ఠయైనదియునైయున్నది.

మూ॥ దేహేష్వియం కుణ్డలినీన్యగాది
భూతేషు విద్యుద్ భువనేషు చాభ్రమ్
దేవాఙ్గనామస్తక లాలి తాఙ్ఘ్రి-
ర్దేవీ భవానీ ఖలుదేవతాసు 22

ఈ విద్య – శరీరములయందు కుండలినిగా చెప్పఁబడుచున్నది. భూతములయందు విద్యుత్తుగా చెప్పఁబడుచున్నది. భువనములయందు – ఆకాశముగాఁ జెప్పఁబడుచున్నది. దేవతల యందు – దేవాంగనామ స్తకముల యందు లాలితములగు చరణములు గల యీ దేవి – భవానియైయున్నది గదా!

మూ॥ చక్షుర్విధాయాచలమస్త్రేణ
ప్రాణం ప్రపశ్యన్ మనువర్ణరూపమ్।
సంసేవ తేచేత్ సకలస్యధాత్రీం
సర్వేష్టలాభో విదుషః కరస్థః॥ 23

నేత్రమును స్థిరముగా నుంచి – మంత్రాక్షర రూపమగు ప్రాణమును – సమీక్షించుచు, ప్రపంచభర్త్రియగు పరమేశ్వరి నుపాసించుచు, శ్రీ విద్యను సేవించుచున్న విద్వాంసునకు – సర్వేష్టలాభము – హస్తగతమగుచున్నది.

**ప్రభ**:- ఇందు మంత్రయోగము పదేశింపఁబడినది. అదియు గుర్వనుగ్రహము వలన అనుభవము చేతనే తెలియఁదగినదై యున్నది. ఇందలి యభిప్రాయము నిట్లెఱుంగునది. మనస్సు చేత – జపకర్మయందు ప్రవర్తించు, ప్రాణ వాయువు యొక్క రాకపోకలయందు జాగరూకుఁడగు నుపాసకునకు, ప్రాణమే – మంత్రవర్ణరూపమగు చున్నది. ప్రాణమే మంత్రరూపమున నినదించు (ధ్వనించు) చున్నదను జ్ఞానము దానికి కలుగుచున్నది. శ్రీరమణగీతయందలి మనో నిగ్రహాధ్యాయమునం దీమంత్రయోగ మిట్లు వర్ణింపఁబడినది.

శ్లో॥ ''జపేనవాఽధమన్త్రాణాం మనసో నిగ్రహో భవేత్
మానసేనతదా మన్త్రప్రాణయో రేకతాభవేత్॥
మన్త్రాక్షరాణాం ప్రాణేన సాయుజ్యం ధ్యానముచ్యతే
సహజ స్థితయే ధ్యానం దృఢభూమిః ప్రకల్పతే.

''మంత్రములను జపించుట చేతఁగూడ మనస్సు యొక్క నిగ్రహము కలుగును. అప్పుడు మనస్సును – మంత్ర ప్రాణములును ఏకీభవించును. మంత్రాక్షరములు – ప్రాణము – ఏకీభవించుట ధ్యానమని చెప్పఁబడును. సహజ స్థితియగు ఆత్మ నిష్ఠకు ఈ ధ్యానమే ధృఢభూమియై యున్నది.'' '' ఇట్లు –



ఉపాసింపఁబడుచున్న మంత్రముల కన్నిఁటికిని, ప్రాణములతోడి సాయుజ్యం (ఏకత్వము) కలుగుననునది తత్త్వరహస్యమై యున్నది. అందును విశేషించి, పంచదశాక్షరీ మంత్రము వలన సిద్ధికలుగుననుట – ప్రసిద్ధము. ఈ పంచదశియందు మంత్రాక్షరములే – దేవికి అవయవరూపములగుచున్నవి'' అని యాగమములం దుద్ఘాటింపఁబడినది. ఈ మంత్రముల నుద్దేశించి శంకర భగవత్పాదకృతమగు ఆనందలహరి యందు ''శివః శక్తిః కామః' అను మంత్రోద్ధార శ్లోకమున ''భజన్తె వర్ణాస్తే తవజనని నామావయవతామ్'' జననీ ఆ వర్ణములు – నీయవయవత్వము నొందుచున్నవి'' అని చెప్పబడినది. (లలితా) సహస్రనామములందుఁగూడ ''మూలమన్త్రాత్మికా మూలకూటత్రయ కలేబరా'' ఇత్యాదికము నందీయంశము కీర్తింపబడినది. ఈ మంత్రమును, గురు ముఖమునఁ దెలిసికొని ఉపాసింప వలయును. (నియమయుక్తమగునపుడు – శీఘ్రముగా సిద్ధించును.)

మూ॥ ఏకాక్షరీః పంచదశాక్షరీం వా
విద్యాః ప్రకృష్టాః సకలేశశక్తేః।
యోభక్తియుక్తః ప్రజపేదముష్య
ప్రాణోవశో నిస్తుల సిద్ధియోనిః. 24

బీజాక్షర రూపిణిలగు హ్రీం; క్రీం; హ్రూం, శ్రీం, ఇత్యాదులగు ఏకాక్షరులను గాని, పంచదశాక్షరిని గాని, సర్వేశ్వర శక్తికి సంబంధించిన ప్రకృష్టలగు దశమహా విద్యలను గాని, భక్తియుక్తుఁడై జపించువానికి సాటిలేని సిద్ధులకు జన్మభూమియగు ప్రాణమువశ పడును.

**ప్రభ**:- భువనేశ్వరీ బీజాక్షర రూపిణియగు 'హ్రీం' అనునదియు, కాళీబీజాక్షరరూపిణి యగు 'క్రీం' అనునదియు, ప్రచండచండీ బీజాక్షర రూపిణియగు 'హ్రూం' అనునదియు, లలితా బీజాక్షర రూపిణీయగు 'శ్రీం' అనునదియు, మొదలగునవి – ఏకాక్షరులై యున్నవి. వీనిని గాని, వెనుక చెప్పఁబడిన

పంచదశాక్షరిని గాని, దశమహా విద్యలను గాని, జపించు సాధకునకు – ప్రాణవశీకారము సిద్ధించును. ప్రాణ శక్తి – వశపడిన యెడల సిద్ధులన్నియు హస్తగతములగునని భావము.

మూ॥ ఏతాః కవీనాం పదకిఙ్కరస్య
పూతాః ప్రమోదం పరమావహన్తు
గీతాస్సభక్తి ద్రవ మిన్ద్రవజ్రాః
శ్వేతాచలాధీశ్వర వల్లభాయాః 25

భక్తి రసముతోఁ గూడి గానము చేయఁబడినవియు, పవిత్రములయినవియు, కవిచరణ భజకుఁడగు గణపతిచే రచింపఁబడినవియు, నగు ఇంద్రవజ్రావృత్త నిబద్ధములగు స్తుతులు – కైలాసపతి ప్రేయసియగు జగదంబకు పరమప్రమోదము నొసఁగుగాత!

ఇది సవ్యాఖ్యమగు ఏకోనచత్వారింశ స్తబకము

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీ సరస్వత్యైనమః

# ఉమాసహస్రము

## (పదియవ శతకమున – చతుర్థ స్తబకము)

## చత్వారింశస్తబకము

**అవ:-** నలువది యగు నీ **యుపసంహార స్తబకమున** – పరదేవతకు – విశ్వములోపలను; వెలుపలను, గలవియు, శ్రీమంతములును, ఊర్జితములును, నగు స్థానముల యందును, విభూతులయందును, స్పష్టమగు సముపాస్యత్వమును దెలుపునవియు వేద, వేదాంత, తాంత్రిక, యోగ, సారభూతములగు తత్త్వములను దెలుపునవియు, నగు రమణీయ గానము గల దైవ గీతములు – గానము చేయఁబడుచున్నవి. ఇవి – పండితులకును, పామరులకు గూడ సులభముగాఁ దెలియునవై యున్నవి. **(కనుక ఈ స్తబకము ముఖ్యమైనది.)**

మూ॥ శమయతుపాపం, దమయతు దుఃఖం,
హరతు విమోహం, స్ఫుటయతు బోధమ్।
ప్రథయతుశక్తిం మన్దం హసితం
మనసిజ శాసనకుల సుదృశోనః॥ 1

మనసిజ శాసనుఁడగు పరమేశ్వరుని కులాంగనయగు పరమేశ్వరి యొక్క దరస్మితము – మాపాపమును తొలఁగించుఁగాత! దుఃఖమును ధ్వంస మొనర్పుఁగాత! వ్యామోహమును (భ్రాంతిని) పోఁగొట్టుఁగాత! జ్ఞానమును వికసింపఁజేయుఁగాత! శక్తినావిష్కరించుఁగాత!